క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి చర్యలు

కోటబొమ్మాళి: ఈ నెల 14న జరగనున్న జాతీయలోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత అన్నారు.శ నివారం ఆమె న్యాయవాదులు, పోలీసుల అధికారులతో లోక్ అదాలత్‌పై సమీక్షించారు. కేసుల రాజీకి గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఏజీపీ ఎస్.తిరుపతి, బార్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, న్యాయవాదులు కవిటి మన్మథరావు, వాన నేతాజీరావు ఉన్నారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి

సోంపేట: వినాయక చవితి, దుర్గాదేవి మహోత్సవ సమయంలో సంప్రదాయంగా వస్తున్న మట్టి విగ్రహాలనే తయారు చేసి పూజించాలని జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి అన్నారు. గొనకపాడు ఉన్నత పాఠశాలలో శనివారం సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. రసాయనాలతో కూడిన విగ్రహాలు వాడడం వలన పర్యావరణానికి హాని చేకూరుస్తాయన్నారు. సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మట్టివిగ్రహాలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

టెక్కలి: మరణించిన తరువాత మరో ఇద్దరికి చూపునివ్వడానికి ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కంటి వైద్య నిపుణురాలు ఎం.సాయినిఖిత కోరారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా శనివారం ఆస్పత్రి ప్రాంగణంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేత్రదానంపై ఎటువంటి అపోహలకు గురి కావద్దని సూచించారు. చనిపోయిన తరువాత కళ్లను బూడిద కాకుండా మరో ఇద్దరికి ప్రపంచాన్ని చూపించడానికి నేత్రదానం చేయాలని ఆమె కోరారు. నేత్రదానంపై గ్రామ స్థాయిలో మరింత చైతన్యవంతం చేయాలని ఆశ వర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అలెగ్జాండర్ నిర్మల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి 56 వంటకాలు నైవేద్యం



శ్రీకృష్ణుడికి సమర్పించిన వంటకాలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో శనివారం రాత్రి ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రేమతో 56 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ఇచ్ఛాపురం: సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.వి.అనంతాచార్యులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సీపీఎస్ రద్దు డిమాండ్లతో ఉన్న కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పి.శంకర్, ప్రధాన కార్యదర్శి జి.ఉమాశంకర్, పావని, సత్యమయ్య, ధర్మరాజు, రాజు, కామరాజు, రవీంద్రబాబు ఉన్నారు.

మత్స్యకారులకు సరుకులు వితరణ

కవిటి: మూడురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పలువురు పేదలకు నిత్యావసర సరుకులు వితరణ చేసిన యువసూర్య చారిటబుల్‌ట్రస్టు సేవలు ప్రశంసనీయమని ఇద్దివానిపాలెం సర్పంచ్ గండుపల్లి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు ఎరిపిల్లి రామయ్య అన్నారు. ఇద్దివానిపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన 50 కుటుంబాలకు ట్రస్టు చైర్మన్, యువ న్యాయవాది ఎం.రాంబాబు ఆధ్వర్యంలో రూ.20 వేల విలువై నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు

ఏటీఎం కార్డు మార్చేసి నగదు దోచేశారు

కాశీబుగ్గ: కాశీబుగ్గలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద శనివారం సాయంత్రం నగదు కాజేసిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే వజ్రపుకొత్తూరు మండలం కొండూరుకు చెందిన కె.పుష్పవతి ఏటీఎం నుంచి నగదును తీసేందుకు వచ్చారు. ఆ సమయంలో ముగ్గురు యువకులు అక్కడకు వచ్చి గొడవపడుతున్నట్లు వాతావరణం సృష్టించారు. తరువాత పుష్పవతితో మాటలు కలిపి నగదు తీస్తామని చెప్పి కార్డును మార్చేసి పిన్‌ను తెలుసుకున్నారు. అనంతరం రూ.14,500 నగదును విత్‌డ్రా చేసుకుని తీసుకుపోయారు. మోసపోయినట్టు తెలుసుకున్న ఆమె కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ మోహనరావు కేసునమోదు చేశారు.

హరివిల్లు కనువిందు



వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. వర్షం సైతం కురుస్తుంది. శనివారం ఒకపక్క చిరుజల్లులు కురుస్తూనే మరోపక్క ఆకాశంలో హరివిల్లు కనువిందు చేసింది. రెండువైపులా భూమిని తాకేలా ఇంద్రధనస్సు టెక్కలి, కంచిలిలో అలరించింది. సుమారు 30 నిమిషాలు కనిపించిన దీన్ని స్థానికులు సెల్ ఫోన్లలో బంధించేందుకు ఆసక్తి చూపారు.

-టెక్కలి రూరల్/కంచిలి

వైద్యానికి చేయూత



వజ్రపుకొత్తూరు మండలంలోని బైపల్లి గ్రామానికి చెందిన తామాడ నిరంజన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. బాధితుని తండ్రి చనిపోగా తల్లి లక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా నిలుస్తున్న తరుణంలో నిరంజన్ కూడా ప్రమాదం బారిన పడడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు రూ. 12 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని నిరంజన్‌కు శనివారం అందజేసి అండగా నిలిచారు. సొసైటీ అధ్యక్షుడు బత్తిని తిరుపతి, ఉపాధ్యక్షులు కె.చంటి, సభ్యులు ఝాన్సీ, సైని శాంతి, జి.పుష్ప, కె.కుమార్, అజయ్ ఉన్నారు.

-వజ్రపుకొత్తూరు రూరల్

మొక్కలు నాటివేత



పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీఒక్కరూ మొక్కలు నాటాలని ఇచ్ఛాపురం మండల తహసీల్దార్ వెంకటరావు అన్నారు. పట్టణంలోని హెబ్రాన్ పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈసందర్భంగా విద్యార్థులందరితో ఒక్కో మొక్కనాటించి పరిరక్షించాని కోరారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జాన్‌వెస్లీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

-ఇచ్ఛాపురం

లోతట్టు ప్రాంతాలు జలమయం



కాశీబుగ్గ: రెంటికోట సచివాలయం ఎదురుగా రోడ్డుపై నిలిచిపోయిన వరదనీరు



కాశీబుగ్గ: సున్నాడ గ్రామం వద్ద రోడ్డుపై వర్షం నీరు



ఇచ్ఛాపురం రూరల్: బహుదాలోకి చేరిన వరద నీరు



ఇచ్ఛాపురం రూరల్: ఇన్నేశుపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ధర్మపురం గెడ్డ

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు, చెరువులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. కొన్నిచోట్ల పంటపొలాలు నీట మునుగుతున్నాయి. శనివారం వేకువజాము నుంచి కురిసిన వర్షానికి చాలారోడ్లు పాడయ్యాయి. రోడ్లు కోతకు గురవుతుండడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొబ్బరిరైతుకు ఊరటనిచ్చిన వర్షం

కవిటి: బంగాళాఖాతంలో ఏర్పడిన యువగుండం కారణంగా కురుస్తున్న వర్షాలతో ఉద్దానం ప్రాంతంలో సాగు చేస్తున్న కొబ్బరి పంటకు జీవం వచ్చింది. గడచిన రెండు సంవత్సరాలుగా సరైన వర్షాల్లేక చెట్లు చనిపోతున్న నేపథ్యంలో ఈ వర్షాలు రైతులకు ఎంతో ఊరటనిచ్చాయి. అలాగే ఖరీఫ్ వరిసాగు చేసిన బీలప్రాంతం అన్నదాతలకు సైతం ఈ వర్షాలు ఎంతో అనుకూలంగా మారాయి. కవిటి మండలంలో శనివారం 4.2 మిల్లీమీటర్ల స్వల్పవర్షపాతం మాత్రమే నమోదైందని రెవెన్యూ అధికారులు గణాంకాలు చెబుతున్నాయి.

బాహుదాకు జలకళ

ఇచ్ఛాపురం రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఒడిశాలో భారీ వర్షాలకు బహుదానది, ధర్మపురం గెడ్డలో వరద నీరు చేరింది.



కాశీబుగ్గ: లొత్తూరు బస్టాండ్ వద్ద పరిస్థితి..



కాశీబుగ్గ: లొద్దభద్ర గ్రామం వద్ద రోడ్డుపై నుంచి పారుతున్న నీరు



కవిటి: కొబ్బరితోటలో వర్షం కురుస్తున్న దృశ్యం

కౌన్సిల్ సభ్యులతో గౌరవంగా మెలగాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి



మున్సిపల్ కమిషనర్‌ను నిలదీస్తున్న భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, వైస్‌చైర్‌పర్సన్లు

● మున్సిపల్ సమావేశంలో సభ్యులు

ఇచ్ఛాపురం: కౌన్సిల్ సభ్యులతో మున్సిపల్ అధికారులు మర్యాదలేకుండా ప్రవర్తించడం, వాళ్లకు నచ్చినట్లు వ్యవహరించడం సరికాదని వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాబాల స్వర్ణమణి, ఇతర కౌన్సిల్ సభ్యులు అన్నారు. తీరు మార్చుకోవాలని మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. సభ్యుల పట్ల గౌరవంగా మెలగాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో పది అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీ కొత్త మాస్టర్ ప్లాన్ ప్రచురణ అంశంపై కౌన్సిల్ సభ్యులకు ఎటువంటి సమాచాం లేకుండా సిద్ధం చేయడమేమిటనీ సభ్యులు నిలదీయడంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు. మిగిలిన అంశాలైన సాధారణ, అభివృద్ధి పనులకు టెండర్లను పిలిచేందుకు, కుక్కల సమస్య పరిష్కారం, అన్న క్యాంటీన్ పునరుద్ధరణ అంశాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వీధికుక్కల సమస్య పరిష్కారించేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేయాలని నిర్ణయించారు. అనంతరం నిర్వహించిన అత్యవసర సమావేశం ద్వారా మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌కి వచ్చిన ఐదు దరఖాస్తుల్లో న్యాయవాది మొగల్లా రాంబాబుని కౌన్సిల్ సభ్యులు ఎన్నుకున్నారు. అలాగే గతంలో మున్సిపాలిటికీ వచ్చిన నాన్‌ప్లాన్ గ్రాంట్ నిధులలో మిగిలిపోయిన రూ. 26 లక్షలతో మరుగుదొడ్లు, రోడ్లు, గేట్లు వేయాలనే మున్సిపల్ అధికారుల తీరుపై కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. మున్సిపాలిటీలో చాలా సమస్యలున్నాయని వాటిని పరిష్కరించడం కాకుండా ప్రజాధనం దుర్వినియోగం చేయడం ఏమిటని ప్రశ్నిస్తూ ఈ అంశాన్ని వాయిదా వేయించారు. మున్సిపల్ అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడం దురదృష్టకరమని, రాజకీయ కుట్ర కారణంగానే 16వ వార్డులో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయని వైస్‌చైర్‌పర్సన్లు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ ఉన్నారు.

నాయకుల పరామర్శ



కవిటి: కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు



నందిగాం: బాలకృష్ణారావుతో మాట్లాడుతున్న మాజీమంత్రి అప్పలరాజు

కవిటి: మండల వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి దువ్వు కృష్ణారెడ్డి భార్య, నెలవంక మాజీ సర్పంచ్ భూదేవి (42) ఇటీవల మృతి చెందారు. దీంతో కృష్ణారెడ్డిని కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. భూదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కమలాయిపుట్టుగ వెళ్లి ఇచ్ఛాపురం నియోజకవర్గ జేసీఎస్ బూత్‌కన్వీనర్ రాంపత్ని చిట్టిబాబు కుటుంబసభ్యుల్ని కలిసి పరామర్శించారు. చిట్టిబాబు తండ్రి రామ్మూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు ఉన్నారు.

సోంపేట: పాత్రకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గోకర్ల ధర్మారావు తల్లి ఇటీవల మృతి చెందింది. ధర్మారావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించి సంతాపం తెలియజేశారు. కంచిలి మాజీ ఎంపీపీ ఇప్పిలి క్రిష్ణారావు, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, స్థానిక సర్పంచ్ బేసి ఖగేశ్వరరావు ఉన్నారు.

బాలకృష్ణారావుకు మాజీ మంత్రి పరామర్శ

నందిగాం: వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ వాహనానికి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లట్టిగాం సొసైటీ అధ్యక్షుడు కురమాన బాలకృష్ణారావును నందిగాంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. పేరాడ తిలక్, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, చిన్ని జోగారావు, పోలాకి మోహనరావు ఉన్నారు. అలాగే స్థానిక పార్టీ కార్యాలయంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మాట్లాడారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్యోగికి సేవలే గుర్తింపుని స్తాయని ఎంపీపీ బోర పుష్ప, ఎంఈఓ కురమాన అప్పారావు అన్నారు. కె.శాసనాం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పారినాయుడు, ధర్మపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వి.యశోదమ్మలకు శనివారం వేర్వేరుగా జరిగిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బి.చిరంజీవి, ఎస్.విశ్వనాథం, నరేంద్రనాథ్‌పట్నాయక్, జె.సరోజ పాల్గొన్నారు.



యశోదమ్మను సత్కరిస్తున్న దృశ్యం

మాజీ సైనికుల సంక్షేమానికి చర్యలు

టెక్కలి : మాజీ సైనికులకు రాయితీలు కల్పించి వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సైనిక సంక్షేమాధికారి శైలజ అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలోని సంక్షేమ భవనంలో మాజీ సైనికులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సోమేశ్వరరావు, ప్రతినిధులు గోవిందరావు, మాధవరావు ఉన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



టెక్కలి: సిబ్బందితో సమీక్షిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో సుదర్శన్‌దొర



కవిటి: ఇద్దివానిపాలెం తీరంలో పర్యటించిన అధికారులు

టెక్కలి: వాయుగుండం నేపథ్యంలో అధికారులంతా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీవో కె.సుదర్శన్ దొర ఆదేశించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎటువంటి నష్టం వాటిల్లినా తక్షణమే సమాచారం అందజేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో అక్కడ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ బి.వి.తిరుమలరావు, ఆర్‌అండ్‌బీ డీఈ రవికాంత్, డీఎల్‌పీవో ఐ.వి.రమణ ఉన్నారు.

తీరంలో పర్యటన..

కవిటి: తీరప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇద్దివానిపాలెం తదితర మత్స్యకార గ్రామాల్లో వారు పర్యటించి మత్స్యకారులకు భారీవర్షాలపై సూచనలు చేశారు. గ్రామపెద్దలు గండుపల్లి హనుమంతరావు, ఎరిపిల్లి రామయ్య, ఆర్ఐ రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి ఎన్.గుణవతి, వీఆర్ఓ జి.దివాకర్ ఉన్నారు.

సిబ్బందితో సమీక్ష

సోంపేట: వాయుగుండం ప్రభావం నేపథ్యంలో మండలస్థాయి, గ్రామ సచివాలయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.కె.వి.సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో బెండాళం వెంకటరమణ, ఏపీవో ప్రమీల, ఏపీఎం రమణమ్మ పాల్గొన్నారు.

డొంకూరులో తహసీల్దార్ పర్యటన

ఇచ్ఛాపురం రూరల్: వాయుగుండంగా బలపడుతున్న నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతంలో ఉండాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు హెచ్చరించారు. డొంకూరు మత్స్యకార తీర ప్రాంతాన్ని సందర్శించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో తుఫాన్ రక్షిత భవనాల్లోకి వెళ్లాలని సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్ట చెప్పారు. అత్యవసర సమయంలో 91141 15367 నంబరుకు ఫోన్ చేయాలని అన్నారు.

ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని తీర ప్రాంత గ్రామల్లో అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వాయుగుండం నేపథ్యంలో మండలానికి నియమించిన ప్రత్యేకాధికారి దేవిఉమామహేశ్వరరావుతో పాటు అధికార బృందం అక్కుపల్లి, మోట్టూరు, హుకుంపేట, మంచినీళ్లపేట గ్రామ సముద్ర తీరాలలో పర్యటించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, వేట సామగ్రిని భద్రపరుచుకోవాలని సూచించారు. తహసీల్దార్ బి.బాల, ఎంపీడీవో ఈశ్వరమ్మ, డిప్యూటీ తహసీల్దార్ వాయిలపల్లి గిరిరాజ్, ఆర్ఐ పవిత్ర ఉన్నారు.

కుమార్‌నాయక్‌కు ఉద్దానం బంధు అవార్డు

కాశీబుగ్గ: ప్రముఖ జానపద కళాకారుడు కుమార్‌నాయక్‌ను ఉద్దాన సాహితీ సాంస్కృతిక వేదిక ఉద్దానం బంధు అవార్డుకు ఎంపిక చేసింది. ఈ విషయాన్ని వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటలకు వజ్రపుకొత్తూరు మండలం డోకులుపాడులో నిర్వహించే కార్యక్రమంలో అవార్డును అందజేయనున్నట్టు చెప్పా రు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం, పాటలపోటీ, నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నియామకం

కంచిలి: ఎస్సీ వర్గీకరణ పోరాట కమిటీ మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కంచిలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం సాయంత్రం ఇచ్ఛాపురం నియోజకవర్గం కమిటీ, కంచిలి మండల సభ్యులంతా కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలశాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారునిగా మద్రిపాటి జోగారావు, గౌరవ అధ్యక్షునిగా మాస్టీల మన్మథరావు, అధ్యక్షునిగా గూండ్ర జగ్గారావు, ఉపాధ్యక్షుడుగా కొక్కిరి రాజు, ప్రధాన కార్యదర్శిగా దడ్డ మోహనరావు, ట్రెజరర్‌గా ఉదయపురం రవి, కార్యదర్శిగా బడియా చంద్రయ్యలను ఎన్నుకొన్నారు.

రైటప్:31ఎస్‌ఎంపి63-280056: నూతన కార్యవర్గం

బంకులో కల్తీ పెట్రోల్, డీజిల్ విక్రయాలు

కాశీబుగ్గ: మందస మండలం హరిపురంలోని ఓ బంకులో కల్తీ డీజిల్, పెట్రోల్ అమ్మకాలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు బంకు వద్ద శనివారం ఆందోళనకు దిగారు. సోంపేట మండలం తాళ్లబద్ర గ్రామానికి చెందిన సారి జోగారావు, రౌతు కృష్ణారావు, జగదీష్‌తో పాటు మరికొంత మంది ట్రాక్టర్ల కోసం డీజిల్‌ను కొనుగోలు చేశారు. పెట్రోల్ బంకు వద్ద క్యాన్లలో డీజిల్ కొనుగోలు చేసి నింపుకొని గ్రామానికి వెళ్లి ట్రాక్టర్లో వేశారు. వేసే సమయంలో డీజిల్ రంగు వాసన పరిశీలించారు. తేడా ఉండడంతో మిగిలిన క్యాన్లను ట్రాక్టర్లో వేయకుండా తిరిగి డీజిల్ క్యాన్లతో బంకు వద్దకు చేరుకొన్నారు. బకెట్లో వేసి పరిశీలించగా రంగు వాసన స్పష్టమైన తేడా కనిపించింది. దీనితో డీజిల్ తీసుకెళ్లిన వారంతా తిరిగి పెట్రోల్ బంకు వద్దకు తీసుకువచ్చారు. ట్రాక్టర్లో వేసిన యజమాని జగదీష్ ట్రాక్టర్ నిలిచిపోయిందని వాపోయారు. దీంతో వారంతా పెట్రోల్ బంకు వద్ద ఆందోళన చేయగా బంకు యాజమాని వచ్చి డీజిల్ తిరిగి బంకులో ఉన్న ట్యాంకుల్లో వేసి మరో ట్యాంక్ డీజిల్ తిరిగి పోసి ట్రాక్టర్ యజమానులకు సర్ది చెప్పారు. డీజిల్ కల్తీ జరిగిందా, వర్షం నీరు నిలడం వల్ల డీజిల్ కలర్ మారిందా అనే విషయంలో తేల్చవలసింది. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ట్రాక్టర్ యజమానులు, వినియోగదారులు తెలిపారు.